# 23. పెళ్లి

అది పాత స్నేహితులు కలిసిచేసుకునే ఒక విందు. వారందరూ గృహస్థాశ్రమంలో ప్రవేశించినా – తమ బ్రహ్మచర్యపు రోజుల్లోలాగే అప్పుడప్పుడు కలుసుకునేవాళ్ళు. తృప్తికరంగా భోజనాలు చేశాక, వారు భూలోకంలోని అన్ని విషయాల్నీ మాట్లాడుకోసాగారు; గడిచిన జీవితంలోనే అనేక ఘట్టాల్ని – అప్రయత్నంగా చిరునవ్వు రేకెత్తించేవీ, హృదయాన్ని కదిపేవీ – అనేక విషయాల్ని ఒకళ్ళనొకళ్ళు జ్ఞాపకం చేసుకోసాగారు.

"జార్జ్! మనం ఒకసారి సానివీధికి వెళ్ళి – ఇద్దరు అందమైన యువతుల్తో ఒక రాత్రల్లా గడిపాం – జ్ఞాపకం వుందా?" అన్నాడు, ఒకడు.

"జ్ఞాపకం లేకేం?"

ఇదే విధంగా ఒకళ్ళకొకళ్ళు జ్ఞాపకం చేసుకుంటున్నారు. వాటి నూతనత్వాన్ని కోల్పోని అనేక విషయాలు వారిని ఆకర్షించినయ్...మెల్లిగా వారి సంభాషణ వివాహాల మీదికి తిరిగేది. ఒక్కొక్కరే తమ అభిప్రాయాన్ని చెప్పసాగారు.

"మళ్ళీ నాకు వివాహమాడే అవకాశం వుంటేనా...? ఈ పెళ్ళి వలలో పడటం చాలా తమాషా సుమా! మొదట్లో అసలు పెళ్ళే వద్దనుకుంటాం; కాని ఒక వసంతంలో ఏ పల్లెటూరో వెళ్తాం. ఆ గాలిలోనే కొత్తజీవం కనిపిస్తుంది. పచ్చికబయళ్ళన్నీ – వెన్నెల ఆవరించినట్టు – తెల్లని పూలతో నిండివుంటయ్. ఏ స్నేహితుడి ఇంట్లోనో ఒక యువతిని కలుసుకుంటాం, అంతే – మనలోని ప్రతిశక్తీ కట్టుబాటవుతుంది! గృహస్థాశ్రమం స్వీకరించి తిరిగి వస్తాం" అన్నాడు, జార్జ్.

"అంతే..నా విషయంలో కొన్ని తమాషా పరిస్థితులున్నా - ఇలాగే ఐంది-" అన్నాడు, పెర్రీ.

"అందుకు నువ్వేమీ విచారపడక్కర్లేదు. నేను ఎరిగినంత మేరలో నీ భార్యంత అందగత్తె గౌరవాన్ని ఎరిగిన ఇల్లాలూ లేదనే చెప్పాలి. మన అందరిలోకీ నువ్వే అదృష్టవంతుడివి-"

"కాని - అది నా తప్పుకాదు!"

"అంటే-?"

"నాభార్య చాలా గొప్పదనటాన్ని ఒప్పుకుంటాను: కాని దానికి నేను బాధ్యుణ్ని కాను."

"తమాషా!"

"కాని - ఇది నిజం. నా కథ చెప్తాను వినండి-" అని పెర్రీ తన కథను చెప్ప నారంభించాను.

* * *

"నాకు ముప్పై ఏళ్ళు వచ్చేప్పటికి - ఉరి స్తంభమైనా ఎక్కవచ్చు కాని, పెళ్ళి మాత్రం చేసుకోకూడదనే నిశ్చయంలో ఉన్నాను. యువతులందరూ ఆనందాన్ని ఇచ్చేవాళ్ళూ, నేను ఆ ఆనందంకోసమే బతుకుతూన్నట్టూ నాకు తోచేది.

మా బాబాయ్ కొడుకు పెళ్లికి - ఒక నవంబరులో నార్మండీ వెళ్ళాను. అది నిజమైన వివాహమనే చెప్పాలి. సాయింత్రం ఐదింటికి భోజనాలకు కూర్చుంటే, పదకొండు కొట్టేదాకా లేవనేలేదు. అక్కడ నాకు 'మేరీ' తో స్నేహమైంది. ఆమె ఫించన్ పుచ్చుకున్న ఒక మిలిటరీ ఉద్యోగి కుమార్తె. ఆమె అందానికి ధైర్యంకూడా కొత్తదనాన్ని యిస్తోంది; ఆమె కళ్ళల్లో మిలిటరీ అహంభావం స్పష్టంగా కన్పిస్తోంది; ఇంకా ఆమెను గూర్చి - ఆమె చెప్పగలిగింది చాలా వుంది. ఆ రోజంతా ఆమె నన్ను 'స్వంతం' చేసుకుంది; నన్ను తోటల్లోకి షికారుకు తీసుకువెళ్ళి, అనేక విషయాలుచెప్పి నన్ను శ్రమపెట్టింది.

'ఇక ఇవ్వాల్టికి చాలు; ఇంక ఎప్పుడన్నా వింటే బాగుంటుంది...కాని, రేపు నేను వెళ్ళిపోతాను. ఐనా ఇప్పటికే ఇది చాలా ఎక్కువ' అనుకున్నాను.

పదకొండు గంటలకల్లా - స్త్రీలందరూ పడుకునేందుకు, ఎవరి గదులకువారు వెళ్ళారు. కాని పురుషులు మాత్రం - పొగ పీల్చి తాగేందుకో, లేక తాగి పొగ పీల్చేందుకో - ఉండిపొయ్యారు.

తెరిచివున్న కిటికీలోంచి పల్లెటూరి నాట్యాలు కనిపిస్తున్నయ్, నీరసంగా మోగే రెండు వీణలకూ, ఒక క్లార్నెట్‌కూ - తాళం వేస్తూ, పల్లె ప్రజలు వలయాకారంలో నాట్యం చేస్తున్నారు. వాయిద్యగాళ్ళు వంటపనికి ఉపయోగపడే పెద్ద టేబిల్‌ను స్టేజిగా వాడుకుంటున్నారు. అప్పు డప్పుడు వారి కంఠాలన్నీ కలిసి, సంగీతాన్ని తొక్కి పారేస్తున్నాయ్; అప్పుడప్పుడు - ఆకాశానికీ, భూమికీ మధ్యగా తేలుస్తున్నట్టు - లయలేని సంగీతం వినిపిస్తోంది.

రెండు పెద్ద పీపాల్లోని సారాయిని నాట్యగాండ్రకు అందించటంలో - ఇద్దరు ఊపిరాడకుండా తిరుగుతున్నారు. దాహంగొన్న నాట్యగాండ్రు - తమ నాయకురాండ్ర తలలపైనుంచి, మెడ ముందుకు చాచి - ఖాళీగ్లాసుల్ని చేతుల్లో పట్టుకు నిలబడ్డారు. పెద్ద టేబిల్ మీద - రకరకాల రొట్టెలూ, నాలుగైదు కూరలూ - వెన్నా మొదలైన పదార్థాలు అమర్చబడివున్నయ్. వాళ్ళు ఇష్టం వచ్చినట్లు తింటున్నారు. ఈ మోటు దృశ్యం చూస్తూంటే - ఆ పీపాడు సారా తాగి, ఆ రొట్టెలన్నీ మింగెయ్యాలనిపించింది.

ఏదో పిచ్చి ఆనందం నన్ను తరిమేప్పటికి, నా స్నేహితులందర్నీ, వదిలి యీ పల్లెమూకలో కలిసిపొయ్యాను. అప్పటికే కొంత తాగివున్నానేమో, వాళ్ళకూ కలిసి ఒళ్ళు తెలియనంతగా తాగేశాను. ఆ మైకంలో - ఒకపల్లె యువతి చేతులుపట్టుకొని - బాగా ఆయాసం వచ్చేదాకా పైకీ కిందికీ ఎగిరాను. కాస్త విశ్రాంతి తీసుకొని, మళ్ళీ ఇంకో గ్లాసు పుచ్చుకొని, పూనకం పట్టినట్టు - ఇంకో యువతితో నాట్యంచేశాను. నేను అప్పటికి చాలా హుషార్‌గా ఉండేవాణ్ణి. మిగతా యువకులందరూ నన్ను అనుసరించాలని చూశారు; యువకులందరూ నాతో నాట్యం చెయ్యాలని ప్రయత్నించి, పాలు తాగిన ఆవుదూడల్లాగు ఎగరసాగారు. ఇలా రాత్రి రెండు గంటలదాకా తాగి, తందనాలాడాను. నా స్థితిని చప్పున తెలుసుకొని, నా గది వైపు మళ్ళాను. ఆ పెద్ద ఇల్లు - చీకట్లో, నిశ్శబ్దంలో కునికిపాట్లు పడుతోంది. నా దగ్గర అగ్గిపెట్టె లేదు; అందరూ గాఢనిద్రలో వున్నారు. నా మైకం మరీ ఎక్కువైంది. ఎంతో కష్టంమీద మేడమెట్లు కనుక్కున్నాను. కిందిమెట్టుమీద కూర్చొని దూరదూరాలకు పారిపోయిన భావాల్ని మెల్లిగా కూడదీసుకు నేందుకు ప్రయత్నించసాగాడు.

నాగది రెండో అంతస్తులోవుంది... అదృష్టవశాత్తూ గుర్తొచ్చింది - ఎడం చేతివైపు మూడోగది! ఈ నిశ్చయం కొత్త బలాన్ని ఇచ్చింది. అంతగా కష్ట పడకుండానే లేచాను. తూలి కిందపడకుండా ఉండేందుకు, మెట్ల పక్కగా అమర్చబడ్డ చువ్వను గట్టిగా పట్టుకొని, చప్పుడు కాకుండా, మెల్లిగా ఒక్కో మెట్టే ఎక్కసాగాను. నాలుగైదుసార్లు మెట్టుతప్పి, కింది మెట్టుమీద మోకరించాల్సి వచ్చింది! గట్టిగా చువ్వ పట్టుకోవటంవల్ల కిందపడి రసాభాస కాకుండా నన్ను నేను కాపాడుకో గలిగాను. ఎల్లాగో రెండో అంతస్తు జేరాను. మెల్లిగా గోడను ఆధారం చేసుకొని ముందుకు సాగాను. ఒక తలుపువచ్చింది.... 'ఒకటి' అని నాలో నేను లెక్కించుకున్నాను. ఆ క్షణానే తూలి, ఆ

గోడ దగ్గర్నుంచి – దానికి ఎదురుగావున్న గోడమీద పడ్డాను; మళ్ళీ బలవంతాన మొదటి గోడ వైపుకే తిరిగి వచ్చేందుకు ప్రయత్నించాను. అతి కష్టంమీద ఎలాగో ఎడమ గోడను జేరుకున్నాను. అతి జాగర్తగా మళ్ళీ ముందుకుసాగి, ఇంకో తలుపు కనుక్కున్నాను; 'రెండు' అని నాకు బాగా వినిపించేట్టు లెక్కించుకున్నాను. అదేవిధంగా ఇంకో తలుపుదగ్గరికి రాగానే 'మూడు' అనుకున్నాను. ఇదే నా గది! తలుపు నెట్టాను; తెరుచుకుంది. ఆ మైకంలో నేను అనుకున్నాను; 'ఇది నా గది కనుకనే నెట్టంగానే తలుపు తెరుచుకుంది. ఇంకోరిదైతే లోపల గడియ వేసుకునేవాళ్ళేగా!'

చప్పుడు కాకుండా తలుపువేసి – ఆ చీకట్లో ముందుకు సాగాను. నా చేతికి ఏదో మెత్తగా తగిలింది; తడివిచూసి, సోఫాగా గుర్తించాను. ఒకవేళ లాంతరు, అగ్గిపెట్టా వెతికేశ్రమ తీసుకున్నా, అది నన్ను కనీసం రెండు గంటలన్నా ఏడిపించకుండా దొరకదు. మరో రెండు గంటలు బట్టలు మార్చేందుకు కూడాను! ఇంతా ఏడుస్తే అగ్గిపెట్టె దొరక్కపోవచ్చు! అందుకనే శ్రమపడకుండా, ఏదో బూట్స్ మాత్రం విప్పి, బెల్టూ, కోటు గుండీలూ వదులు చేసుకొని – గాఢనిద్రకు ఉపక్రమించాను.

తరువాత కొన్ని గంటలు గడిచివుంటయ్ – నా చెవి దగ్గర వినబడే కఠోర కంఠధ్వని నన్ను మేల్కొల్పింది–

"ఇంకా నిద్రేనా? సోమరిపిల్లా! పదిగంటలైంది – తెలుసా?"

"అప్పుడే పదా? రాత్రి చాలా అలసిపొయ్యాను–" అంది ఒక స్త్రీ కంఠం.

ఈ సంభాషణభావమేమిటో తెలియక నేను ఆశ్చర్యపోతున్నాను. నేను ఎక్కడ వున్నాను? ఈ భూమి మీద ఏం చేస్తున్నట్టు? కాని నా మనస్సు ఇంకా పెద్ద మంచుతెర వెనుకనే వుంది.

"కిటికీలు తెరుస్తాను–" అంది మొదటికంఠం.

కాస్సేపటికి – నా సోఫాను సమీపిస్తున్న అడుగుల చప్పుడు విని ఏదో భయంతో లేచి కూర్చున్నాను. అప్పుడే నా తలపైపడ్డ బరువైన చేతిని – విసిరి కొట్టాల్సి వచ్చింది.

"ఎవరదీ?" అంది ఆ కంఠం – భయంకరంగా.

సమాధానం చెప్పకుండా జాగర్తపడ్డాను. ఆ చేతులు ఎవరివో కాని, చాలా మోటుగావున్నయ్. కాస్త ఆగి ఆ చేతులు నన్ను గట్టిగా పట్టుకున్నయ్. నేను పట్టు వదిలించుకునేందుకు పోట్లాడాల్సి వచ్చింది. అదే కాస్త పెద్దదయ్యేప్పటికి ఒకళ్ళనొకళ్ళం తీవ్రంగా ఎదుర్కొంటూ, గదిలోని సామానులతో గదిగోడల్ని సర్దసాగాము.

ఇంతలో స్త్రీ కంఠం సహాయంకోసం కేక వేసింది. సేవకులు, పెళ్ళికి వచ్చిన బంధువులూ – చాలామంది గుమికూడారు. కిటికీ తలుపులన్నీ పూర్తిగా తెరువ

బడినయ్. తీరా ఆ వెల్తుర్లో చూస్తే, నేను మిలిటరీ ఉద్యోగితో యుద్ధం చేస్తున్నాను. నేను రాత్రి పడుకున్న సోఫా - అతని కుమార్తె పక్కకు పక్కనే వుంది!

చూడవచ్చినవారు మమ్మ విడదీశారు. ఎంతో భయం నన్ను తరిమినట్టుగా - చప్పున నాగదిలోకిదూరి, తలుపు గడియ వేసుకున్నాను. నా బూట్స్‌ను ఆ తొందరలో ఆ గదిలోనే వదిలిరావటం వల్ల - కాళ్ళను కుర్చీలోనే పెట్టుకోవాల్సి వచ్చింది.

బైట అంతా గందరగోళంగా వుంది. తలుపులు తెరిచిన శబ్దమూ, మూసిన శబ్దమూ వినిపిస్తోంది. అన్నివైపులా గుసగుసల మొదలూ తిట్లదాకా చెలరేగుతున్నయ్. అరగంట గడిచాక నా గది తలుపు శబ్దమైంది.

"ఎవరూ?" అన్నాడు.

"నేనే!"

ఆయన మా బాబాయ్. మెల్లిగా తలుపు తీసి ఆయన్ను రానిచ్చాను. ఆయన ముఖం కోపంతో ఎర్రబారింది; నోరారా నన్ను తిట్టాడు.

"నా ఆతిథ్యాన్ని తిరస్కరించినట్టు - ఒక నీచుడిలాగు ప్రవర్తించావ్... తెలిసిందా?" అన్నాడు.

తరువాత మృదువైన కంఠంతో ఆయన మెల్లిగా అన్నాడు : "అది కాదురా - గాడిదా! తెల్లారి పదింటిదాకా ఉండి ఎల్లా పట్టుబడ్డావట? దానిగదిలో బండలాగుపడి నిద్రపోకపోతే...పూర్తికాగానే.."

"అదికాదు బాబాయ్! ఇందులో కుంభకోణం యేమిలేదయ్యా! నేను బాగా తాగబట్టి, నా గది అనుకొని పొరబడ్డాను-" అన్నాను.

ఆయన చీత్కారంచేసి, "ఏడిశావ్, వెధవవేషాలు వెయ్యవోక-" అన్నాడు.

"నిజంగా - ఒట్టు" అన్నాను.

"నిజమేలే...ఇప్పుడు అలా అనటంకన్న ఇంకేం చెయ్యగలవ్?"

ఈ మాటతో నాకు బాగా కోపం వచ్చింది; కాని ఆ కోపాన్ని తొక్కిపట్టి, నిజంగా జరిగిన కథంతా ఆయనకు చెప్పాను. ఏది నమ్మటమా అన్నట్టు ఆయన కళ్లు పెద్దవయినయ్. ఆయన నన్ను వదిలి, మిలిటరీ ఉద్యోగిని కలుసుకునేందుకు వెళ్ళాడు. ఈ వ్యవహారంలోని న్యాయాన్యాయాల్ని విచారించేందుకు కొంత మంది పెద్దమనుషులు కూడు తారని విన్నాను.

ఒక గంట గడిచాక, వాదోపవాదాల్నీ, సాక్ష్యాల్నీవిని తీర్పుతో సిద్ధమైన జడ్జీ గారి మొహంతో - బాబాయ్ నా దగ్గరికి వచ్చాడు.

"అసలు నిజం ఏదన్నా కానీ - నువ్వు విధిగా అతని కూతుర్ని పెళ్ళి చేసుకోవటంకన్న ఇంకో దారిలేదు-" అన్నాడు, బాబాయ్.

నేను కుర్చీలో ఎగిరిపడి, "నేను దీనికి మాత్రం ఒప్పుకోను–" అని ఖచ్చితంగా చెప్పాను.

"ఐతే ఏం చేస్తానంటావ్?"

"ఏం – నా బూట్స్ తీసుకుని, తక్షణం ఇక్కణ్నుంచి ఉడాయిస్తాను–"

బాబాయ్ సీరియస్‌గా అన్నాడు : "ఇదేం నవ్వులాట కాదురోయ్! నువ్వు యీ పెళ్ళికి ఒప్పుకోకపోతే మాత్రం, నీ ఒళ్ళు హూణం హూణం చేసి, నీ బుర్ర రామకీర్తన పాడిస్తానంటున్నాడు – సరే – అసలు విషయాన్ని పరిశీలిద్దాం– నువ్వు రాత్రి ఆమెతో గడిపేవుంటే – ఆమె కన్యాత్వాన్ని పాడుచేశావ్ కనుక, ఆమెను వివాహమాడక తప్పదు. ఒకవేళ నువ్వు చెప్పే కథే నిజమనుకుందాం; ఎవ్వడూ తనకు తానై అంత నీచంగా ప్రవర్తించడు. అసలు – ఆమె శీలం కాస్తా నిజంగానో, అబద్ధం గానో కానీ పాడైంది. నువ్వు చెప్పే కథను మాత్రం బతికిన వాడెవ్వడూ నమ్మడు. దీని ఫలితమంతా ఆ అమ్మాయికేగా!....మళ్ళీ ఆలోచించు."

బాబాయ్ మెల్లిగాలేచి జారుకుంటున్నాడు.

"నీ ఇష్టం వచ్చింది వాళ్ళకుచెప్పు; కాని నేను ఆమెను పెళ్ళిమాత్రం చేసుకోను–" అన్నాను. బాబాయ్ కోపంతో విసురుగా తలవూపి, వెళ్ళిపొయ్యాడు.

గంట గడిచాక, పిన్ని నన్ను చూసేందుకు వచ్చింది. ఆమె కాస్సేపు ఏడ్చి, మామూలు వేదాంతాన్ని ఏకరువు పెట్టింది. అంతమంది జనంతో కిటకిటలాడే ఇంట్లో ఏ యువతీ, గదితలుపు వేసుకోవటం మరిచిపోతుందనే విషయాన్ని కూడా – ఎవ్వరూ నమ్మలేదట! ఆమె తండ్రి చేతిలో దెబ్బలు తిని, ఆ పగలంతా ఏడుస్తూనే వుందట! అంతమంది కళ్ళ ఎదుటపడ్డ యీ అపవాదు ఏ విధంగానూ వదిలే మార్గం కూడా లేదట!

"అందుకని – ఆమెను నీ భార్యగా కోరుతూ మిలిటరీ ఉద్యోగికి ఉత్తరం రాయి...పైమాటలు జరుగుతూన్నప్పుడు ఏదో పేచీవేసి తప్పుకుందాం!" అంది, తెలివైన పిన్ని.

ఇది నా కొక విధంగా నచ్చింది. ఆమె కోరినట్టే ఉత్తరం రాశాను. ఒక గంట గడిచాక పారిస్‌లో బతికి బైటపడ్డాను. మర్నాడు, నేను కోరిన వివాహం అంగీకరించబడ్డట్టు ఉత్తరం వచ్చింది. మరోవారం గడిచేప్పటికల్లా – ఏ పాచికా పారలేదు కాబోలు – శుభలేఖలు పంచబడ్డయ్; వివాహపు కాంట్రాక్టులు దస్కత్ చేయబడినయ్. ఇంకేముందీ – ఒక సోమవారం ఉదయాన, పెళ్ళి కొడుకు దుస్తుల్లో చర్చిలో నిలబడ్డాను. నా పక్కనే విచారంగా, దిగులుగా నిలబడ్డ యువతిని – జీవితమంతా నాతో సమానంగా చూసుకుంటూ భార్యగా స్వీకరిస్తానని వాగ్దానం చెయ్యక తప్పిందికాదు.

ఆమెనుచూసి వారమైంది. ఆశ్చర్యంతో కూడిన హేయభావంతో ఓర చూపుల్ని ఆమెవైపు ప్రసరింపజేశాను. ఆమె కురూపత్వానికి చాలా దూరంలో వుందని వెంటనే తెలుసుకున్నాను. కాని యీ నవ్వులాటంతా - ఆమెకు కాదు- నాకేనేమో? ఆ పగలు ఒక్కసారన్నా ఆమె నా వైపు చూడలేదు; నేవినేట్టు ఒక్కమాటైనా అనలేదు.

అర్ధరాత్రప్పుడు - నా అభిప్రాయాలన్నీ ఆమెకు చెప్పేందుకు, అధికారిలాగు ఆమె దగ్గరికి వెళ్ళాను. ఆమె బాగా అలంకరించబడ్డది. కాని పాలిపోయిన ముఖంతో, కుర్చీలో కూర్చొని ఏడుస్తోంది. నన్ను చూసేప్పటికల్లా లేచి నిలబడి, సిగ్గుతో తల వంచుకుంది.

"నేను నీ ఆజ్ఞల్ని శిరసావహించేందుకు సిద్ధంగా వున్నాను -" అన్నా, నిశ్చల కంఠంతో.

ఇంతవరకూ కథానాయకి పాత్రను ధరించిన యీ సైనికోద్యోగి కూతురు - నిజానికి చాలా అందమైంది. అధికారాన్ని సంపాయించాను కనుక, ఆమెను ముద్దు పెట్టుకున్నాను. మంచిబేరమే చేశానని తెలుసుకునేందుకు నాకు ఎంతో సేపు పట్టలేదు..ఇక నా పెళ్ళయిన యీ ఐదేళ్ళల్లోనూ, ఒక్క క్షణాన కూడా, నా గృహస్థాశ్రమాన్ని గూర్చి, విచారపడనే లేదు.

❋ ❋ ❋

పెర్రీకథ పూర్తి కాగానే స్నేహితులందరూ నవ్వసాగారు.

"పెళ్ళి లాటరీలాంటిది. మనకు మనమై ఎన్నుకోవాలనుకోవటం పొరపాటు. అదృష్టానికే దాన్ని వదిలెయ్యటం మంచిది -" అన్నాడు ఒకడు.

"నిజమే...కాని ఒకటి మాత్రం మరిచిపోవోక, తాగుబోతుల దైవం తనకు తానై పెర్రీని ఎన్నుకున్నాడు-" అన్నాడు జార్జీ, అసలు ఘట్టాన్ని మరిచి పోలేక!